క్లుప్తంగా

అంతరిక్ష పరిశోధనలపై దృష్టి పెట్టాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు రానున్న రోజుల్లో అంతరిక్ష పరిశోధనల దిశగా అడుగులు వేసేందుకు దృష్టి సారించాలని స్పేస్‌ఇన్ఫో టెక్నాలజీస్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ డాక్టర్ మధుచంద్ర పోపూరి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతరిక్ష పరిశోధనలు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుచంద్ర మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనా రంగంలో మరిన్ని ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. ఆయా రంగాలతో పాటుగా అనుబంధ రంగాల్లో సైతం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు గణితశాస్త్రంలో పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, ఇతర పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, సహాయ కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 55 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఒకటవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 55 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఏడవ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే కోర్టులో హాజరుపర్చారు. వారికి న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

నగల దొంగ అరెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): బీరువాలో దాచిన బంగారు నగలు చోరీకి పాల్పడిన దొంగను కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీ కెమెరా ఫుటేజీలు ఆధారంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించి సూర్యాపేటలో సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాణిగారితోటలోని తమ్మినపోతురాజు వీధికి చెందిన పాండురాజు తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 16వ తేదీ రాత్రి ఇంటి తలుపునకు గడియపెట్టి తాళం వేయకుండా వరండాలో పడుకుని నిద్రపోయారు. ఆదివారం ఉదయం 6గంటలకు నిద్రలేచి ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 6 కాసులు బంగారు నానుతాడు, వెండి పట్టీలు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తి నల్గొండ జిల్లాకు చెందిన శ్రీకాకులపు రత్నాల రామాచారిగా గుర్తించారు. నల్గొండ జిల్లా సూర్యాపేటలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు వెళ్లి అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతను పలు కేసుల్లో ఆరు నెలలుగా నగరంలోని జైలులో శిక్ష అనుభవించి విడుదలై బయటకు వచ్చిన వెంటనే మళ్లీ బంగారు నగలు దొంగతనానికి పాల్పడ్డాడు. అతనిపై ఇప్పటికే కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో 16, ఏపీ, తెలంగాణలోని ఇతర స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయని సీఐ నాగరాజు తెలిపారు.

విశ్వనాథ సాహిత్యంపై వ్యాసరచన పోటీలు



విజయవాడ కల్చరల్: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య జీవితంపై వ్యాస, పద్య రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్కారభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంకుమార్ గూటాల తెలిపారు. సోమవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. తెలుగు సాహితీ మూర్తుల తేజోమయమైన జీవితాలను భావి తరాలకు అందించాలనే సంకల్పంతో కవి సమ్రాట్ విశ్వనాథ సాహిత్య సమాలోచన కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్కారభారతి అఖిల భారత సంఘటనా మంత్రి అభిజిత్ గోఖలే మాట్లాడుతూ విశ్వమంత కవి విశ్వనాథ అన్నారు. పోటీలలో ఉచితంగా పాల్గొనవచ్చని.. 6 నుంచి 10వ తరగతి వారికి జూనియర్, సీనియర్ విభాగాలలో తెలుగు పద్యపఠన, వ్యాస రచన పోటీలు, ఇంటర్ ఆపై చదివే వారు విశ్వనాథ కావ్య సమీక్ష, విశ్వనాథకు లేఖ అంశాలలో పోటీ పడవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతులుంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28లోపు 98480 35573 వాట్సాప్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

జోజినగర్‌లో ఉద్రిక్తత

- 42 ఫ్లాట్ల నివాసాల కూల్చివేతకు యత్నం
- బాధితులకు బాసటగా నిలిచిన వైఎస్సార్ సీపీ నేతలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక జోజినగర్ కరెంట్ ఆఫీస్ రోడ్‌లో 42 ఫ్లాట్ల యజమానులు నిర్మించుకున్న నివాసాలను కూల్చివేసేందుకు పోలీసుల రక్షణతో వచ్చిన అడ్వకేట్ కమిషన్ లాయర్లతో సోమవారం ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీలు, క్రేన్లను తీసుకురావడంతో నివాసితులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ నేత, పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, ఆ పార్టీ నగర అధ్యక్షుడు దేవినేని అవినాష్, నాయకుడు పోతిన మహేష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. కూల్చివేతను అడ్డుకుని ఫ్లాట్ల యజమానులకు అండగా నిలబడి నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. చావనైనా చస్తాంగానీ..ఇళ్లను వదిలిపోమని, తమకు న్యాయం చేయాలని బాధితులు నినాదాలు చేశారు. ఇంతలో ఫ్లాట్ల వద్ద మహిళలపై దౌర్జన్యం చేస్తున్నారని అక్కడికి వెళ్లారు. కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషన్‌లో కొందరు మహిళల పట్ల అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తించటంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డ మహిళలు

రూపాయి రూపాయి కూడగట్టుకోవడంతో పాటు అప్పులు చేసి కట్టుకున్న ఇళ్లను కూల్చవద్దని మహిళలు ఆవేదనతో పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. తమ నివాసాలకు మున్సిపల్ ప్లాన్లు ఉన్నాయని, బ్యాంక్ లోన్లు తీసుకుని కట్టుకున్నామని, తమకు తెలియకుండా కొంతమంది వ్యక్తులు శ్రీలక్ష్మీరామ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి ఈ స్థలం తమదని కోర్టును తప్పుదారి పట్టించారని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ భూమిని రక్షించేందుకు వచ్చినట్లుగా విజయవాడ పోలీసులంతా ఇక్కడికి రావడం బాధాకరమని అన్నారు. ఓట్లేసి గెలిపించినందుకు కూటమి ప్రభుత్వం తమకు తగిన బుద్ధి చెప్పిందని మండిపడ్డారు. సుప్రీం కోర్టులో తాము వేసిన పిటీషన్ వాయిదా ఈ నెల 29న ఉన్నందున అప్పటివరకు గడువు ఇవ్వాలని బాధితులు ప్రాధేయపడ్డారు. ఈ మేరకు పోలీసులు వారికి గడువు ఇవ్వటంతో ఫ్లాట్ల యజమానులకు ఊరట లభించింది.



జోజి నగర్ కరెంట్ ఆఫీస్ రోడ్ లోని 42 ఫ్లాట్లను తొలగించేందుకు సిద్ధంగా ఉన్న పొక్లెయిన్లు



తమ ఇళ్లను తొలగించొద్దంటూ రోదిస్తున్న బాధిత మహిళలు



సంఘటన స్థలం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

కిరాయి గూండాలను తీసుకువచ్చారు...

42 ఫ్లాట్లలోని నివాసాల కూల్చివేత సందర్భంగా గొడవ జరుగుతుందని తెలిసి శ్రీలక్ష్మీరామ కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన వ్యక్తులు దాదాపు 200 మందికి పైగా కిరాయి గూండాలను తెప్పించారు. వచ్చినవారు జనంలో కలిసిపోయి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి గొడవ పెద్దది చేసేందుకు యత్నించారు. దాంతో స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. వారంతా ఇక్కడివారు కాదని, గొడవలు సృష్టించేందుకే శ్రీలక్ష్మీరామ కో ఆపరేటివ్ సొసైటీ మనుషులు వచ్చారని చెప్పటంతో పోలీసులు వారందరినీ అక్కడి నుంచి తరిమేశారు. వారంతా జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందినవారని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాద నివారణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం తన నగర పర్యటనలో భాగంగా మ్యూజియం రోడ్, లయోలా కాలేజి మెయిన్ రోడ్, ప్రభుత్వ దంత వైద్య కళాశాల రోడ్, హరిజనవాడ మెయిన్ రోడ్, ఎన్టీఆర్ కాలనీ, ఏఎస్ రామారావు రోడ్, గోపాలరెడ్డి రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ల వద్ద జరుగుతున్న రెయిలింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నగరపాలక సంస్థ తీసుకుంటున్న రక్షణ చర్యల్లో భాగంగా చేసే పనులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కౌన్సిల్ ఆమోదించిన, ప్రమాదాలను నిర్మూలించే అత్యంత అవసరమైన పనులు, తాగునీటి సరఫరా, సీవేజ్ పనులకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. డ్రెయిన్‌లో నీటి పారుదలకు అడ్డంకిగా ఉన్న పైపులను తొలగించాలని, మంచినీటి పైప్‌లు డ్రెయిన్‌లో లేకుండా ఎప్పటికప్పుడు ఎమినిటీస్ సెక్రటరీలు పర్యటించి పరిశీలిస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి, సభ్యులు, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన స్థాయీ సంఘ సాధారణ సమావేశంలో మొత్తం 21 అంశాలపై చర్చించారు. వాటిలో 13 అంశాలకు సంబంధించి సభ్యులు ఆమోదించారు. ఒకటి ధ్రువీకరించగా, 7 అంశాలను వాయిదా వేశారు. ఒక అంశాన్ని రికార్డ్ చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని అన్నారు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో గల కాలనీల అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్లలో నివసించే వారి కాంట్రిబ్యూషన్‌తో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతోందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, స్థాయీ సంఘ సభ్యులు షేక్ రెహమతున్నీసా, శిరంశెట్టి పూర్ణ, ఉద్దంటి సునీత, కుమారి, ఆలంపూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు



పువ్వుల విత్తనాలతో కూడిన విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆతుకూరి శ్రీదేవి

- అవగాహన ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు
- పువ్వుల విత్తనాలతో కూడిన మట్టి విగ్రహాల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుదాం – మట్టి గణపతి విగ్రహాలను పూజిద్దాం అనే నినాదంతో ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ విద్యార్థులు సోమవారం సాయంత్రం పాతబస్తీ వీధుల్లో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కెమికల్స్‌తో కూడిన విగ్రహాలను నదుల్లో నిమజ్జనం చేస్తే జలచరాల ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ అధికారి బి.బ్రహ్మేశ్వర రావు నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు జె.ఆనంద కుమార్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, కుంచం శ్రీనివాస్, జి.పురుషోత్తం, ఎస్.శ్రీనివాసరావు, వి.అరుణ కుమారి, డాక్టర్ కె.కృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పువ్వుల విత్తనాలతో కూడిన విగ్రహాల పంపిణీ

పాతబస్తీలోని శ్రీ బాలగణపతి మహిళా మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ వివిధ రకాల పూల విత్తనాలతో మేళవించిన మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు సోమవారం పంపిణీ చేశారు. శేషయ్యవీధిలో సంస్థ ప్రతినిధులు ఈ విగ్రహాల పంపిణీని ప్రారంభించారు. మొత్తం 1200 విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు ఆతుకూరి శ్రీదేవి మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించటం ద్వారా స్వామి వారి ఆశీస్సులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీ బాలగణపతి మందిరం పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి శ్రీనివాసరావు, కమిటీ ప్రముఖులు మండేపూడి వేణుగోపాలరావు, ఆతుకూరి రాంబాబు కారుమూరి నాగ వెంకటేశ్వరరావు, మారేమళ్ళ సుధాకర్, రాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి శ్రీ బాలగణపతి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు గ్రంధి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీబాలగణపతి స్వామివారి మందిరంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబరు ఆరో తేదీ వరకు 40వ గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గ్రంధి శ్రీనివాసరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగు దశాబ్దాలుగా ప్రతి ఏటా బాలగణపతి నవరాత్రి ఉత్సవాలను కనులపండువగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న రజతకవచాలంకృత శ్రీ బాలగణపతిగా అలంకరిస్తామన్నారు. 28న శ్రీ దక్షిణామూర్తిగా, 29న శ్రీ వాంచకల్ప గణపతిగా, 30న నిజరూప శ్రీ బాలగణపతిగా, 31న శ్రీ అర్ధనారీశ్వరునిగా, సెప్టెంబరు ఒకటిన శ్రీ విద్యాగణపతిగా, రెండో తేదీన శ్రీ నాద్యంతప్రభుగా, మూడున శ్రీ సిద్ధిబుద్ధి సమేత కల్యాణ గణపతిగా, నాలుగున శ్రీ శయన గణపతిగా, ఐదున శ్రీ విజయగణపతిగా స్వామివారిని అలంకరిస్తామని అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ఘనంగా ముగుస్తాయన్నారు. ఆరో తేదీన ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెంబరు ఏడో తేదీన పేదలకు అన్నదానం చేస్తామని తెలిపారు. ఈ ఏడాది స్వామివారి ఉత్సవాల్లో అద్దాల మండపం ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ప్రతిరోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు, వివిధ కార్యక్రమాలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థల తరఫున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి మండేపూడి వేణుగోపాలరావు, సహాయ కార్యదర్శి కారుమూరి నాగ వెంకటేశ్వరరావు, మీడియా కమిటీ చైర్మన్ మారేమళ్ల సుధాకర్, ఉత్సవ కమిటీ చైర్మన్ రాయుడు శ్రీనివాసరావు, మహిళా మండలి అధ్యక్షురాలు ఆతుకూరి శ్రీదేవి, కమిటీ సభ్యులు ఆతుకూరి రాంబాబు, వల్లంకొండ మనోజ్, కొత్తమాసు రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శబరిమల అయ్యప్ప సేవా సమాజం, సద్గురు సత్సంగం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు కేఎల్‌రావు పార్కు రోడ్డులోని ఫైర్ స్టేషన్ వద్ద మట్టి విగ్రహాల పంపిణీ జరుగుతుందని సేవా సమాజం రాష్ట్ర కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయ్ తెలిపారు. ఏటా నగరంలోని పలు ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని, ఫైర్ స్టేషన్ వద్ద వెయ్యి మట్టి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఈ మట్టి విగ్రహాలను తీసుకుని పూజించి ఇంట్లోనే పూల మొక్కలలో నిమజ్జనం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రముఖ సంఘ సంస్కర్త బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతి వేడుకలు సోమవారం కేఎల్ రావు నగర్‌లోని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మండల్ చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ రావు, ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్వీ రావు మాట్లాడుతూ దేశంలో 52 శాతంగా ఉన్న బీసీ వర్గాలన్నీ అభివృద్ధి చెందితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని, ఒకటి, రెండు వర్గాల అభివృద్ధితో దేశాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. బీసీల అభివృద్ధి కోసం బీపీ మండల్ 40 అంశాలతో నివేదిక ఇచ్చారని, మండల్ ఇచ్చిన ప్రతి అంశాన్ని అమలుపరిచే వరకు బీసీలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కూర్మాచారి, కేదారేశ్వరరావు, రఘుబాబు, అడ్డూరి రాము, బెవర శ్రీనివాస్, లక్ష్మణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ లాబీలో పడి పెయింటర్ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ లిఫ్ట్ లాబీలో పడి పెయింటర్ మృతి చెందిన ఘటన గొల్లపూడిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి ల్యాంకో కాలనీలో ఎస్‌కేటీ సాయి సుధ అపార్ట్‌మెంట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు పనిచేస్తున్నారు. వారంతా ఫస్ట్‌ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో మనీష్ అనే వ్యక్తి గాలి ఆడడం లేదని అపార్ట్‌మెంట్ పైకి వెళ్లాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో అక్కడి వారంతా వెళ్లి చూశారు. సెల్లార్ లిఫ్ట్ లాబీలో పడి మనీష్ గాయాలతో కనిపించాడు. స్థానికుల సహాయంతో అతనిని బయటకు తీసి చూడగా అప్పటికే అతను చనిపోయాడు. దీనిపై అపార్ట్‌మెంట్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాయితీలు వెంటనే విడుదల చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావాల్సిన ఎంఎస్‌ఎంఈ రాయితీలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఈడుపుగంటి అనార్ బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావాల్సిన రాయితీల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అనేక యూనిట్లు మూసివేత దశకు చేరుకున్నాయన్నారు. బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏలుగా మారాయని, వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డాయన్నారు. రాయితీల విషయంలో కూటమి ప్రభుత్వం అశ్రద్ధ వహిస్తోందన్నారు. గత 30 ఏళ్లుగా ఏనాడు ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదన్నారు.

రూ.650కోట్లు పెండింగ్..

ఏపీఎస్‌ఆర్టీసీ హైర్ బసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.650 కోట్లు రాయితీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు.

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



పీజీఆర్ఎస్‌లో సమస్యలను ఆలకిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. ఇందులో 31 ఫిర్యాదులు అందగా వాటిల్లో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ – 6, రెవెన్యూ– 2, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి -1, పీఓ (యూసీడీ)– 11, ఎస్టేట్ -1, హౌసింగ్-2, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్-1 ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యను సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఒక సమస్యపై వచ్చిన అర్జీ మళ్లీ రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ (హార్టీకల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు డివిజన్ ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు

పలు డివిజన్‌ల డీఆర్ఎంలతో భద్రతపై జీఎం సమీక్ష సమావేశం



జీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న విజయవాడ డివిజన్ ఉద్యోగి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవస్తవ చేతుల మీదుగా 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు' అందుకున్నారు. సోమవారం జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి ఏజీఎం సత్య ప్రకాష్‌తో కలసి జీఎం సంజయ్ కుమార్ శ్రీవస్తవ విజయవాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్‌ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించి అసాధారణ పరిస్థితులను నివారించడంలో కృషి చేసినందుకు గాను విజయవాడ డివిజన్‌లో నలుగురు, హైదరాబాద్ డివిజన్‌లో ఇద్దరు, గుంటూరు డివిజన్‌లో నలుగురు, గుంతకల్లు డివిజన్‌లో ఒకరు ఉద్యోగులకు జీఎం అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయా డివిజన్‌ల డీఆర్ఎంల వర్చువల్ సమావేశంలో మాట్లాడుతూ ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్‌లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో జరుగుతున్న పునరాభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు, భద్రత ప్రొటోకాల్స్ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితిలో భారీ సామగ్రిని తీసుకువెళ్లే వాహనాలు, క్రేన్‌ల కదలికలతో సహా నిర్మాణ కార్యకలాపాలలో అన్ని భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. జోన్‌వ్యాప్తంగా ఎల్‌సీ గేట్ల వద్ద భద్రత చర్యలు పటిష్టం చేయాలన్నారు. రోడ్డు ట్రాఫిక్ అతిక్రమణలపై దృష్టిసారించి అన్ని నాన్-ఇంటర్ లాకింగ్ గేట్ల వద్ద భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌సీ గేట్ల అతిక్రమణలపై వాహనదారులకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్‌లు నిర్వర్తిస్తూ రైళ్ల కార్యకలాపాలు సజావుగా సాగేలా చర్యలు చేట్టాలని ఆయన ఆదేశించారు.

రెండు స్థానాలకు బరిలో ముగ్గురు

- కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ పదవులకు ఎన్నికలు
- నేటి సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ డైరెక్టర్ల ఎన్నిక నామినేషన్ల ప్రక్రియ సోమవారం జరిగింది. జనరల్ కేటగిరీలో రెండు స్థానాలు, మహిళా కేటగిరిలో ఒక స్థానానికి ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల కాగా, సోమవారం పాలప్రాజెక్టు ఆవరణలోని క్షీరదర్శిని సమావేశ మందిరంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి కె.గురునాథం పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. మహిళా విభాగంలో చిట్యాలకు చెందిన బోయపాటి సుశీల, విస్సన్నపేటకు చెందిన నెక్కళపు వాణిశ్రీ నామినేషన్లు దాఖలు చేశారు. అయితే బోయపాటి సుశీల నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇక జనరల్ కేటగిరీలో రెండు స్థానాల కోసం పెడన మండలం పెనుమల్లి గ్రామానికి చెందిన ఆర్జా వెంకట నగేష్, వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన యింజం రామారావు, తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గద్దె రంగారావు నామినేషన్లు దాఖలు చేశారు. రెండు స్థానాలకు ముగ్గురు పోటీలో ఉండటంతో ఎన్నికలు అనివార్యమవుతాయా లేదా అనేది మంగళవారం తేలనుంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

ఇంటర్వ్యూకు వెళుతున్నానని యువతి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హైదరాబాద్‌లో ఇంటర్వ్యూకు వెళుతున్నానని బస్సులో వెళ్లిన యువతి భద్రాచలం నుంచి కాల్ చేసి ఆ తర్వాత అదృశ్యమైన ఘటనపై ఆమె తల్లిదండ్రులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం సితార సెంటర్‌కు చెందిన ఆకాంక్ష బీటెక్ పూర్తి చేసింది. హైదరాబాద్‌లో ఓ ఇంటర్వ్యూకు వెళుతున్నానని చెప్పి ఆదివారం మధ్యాహ్నం ఇంటినుంచి వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వేరే ఫోన్ నుంచి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన ఫోన్ స్విచాఫ్ అయినట్లు తెలిపింది. రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చేరుకుంటానని, బస్సు దిగగానే ఫోన్ చేస్తానని చెప్పింది. రాత్రి 10.30 గంటల వరకు ఫోన్ చేయలేదు. తల్లిదండ్రులు ప్రయత్నించగా ఆమె ఫోన్ స్విచాఫ్ వచ్చింది. కొద్ది సేపటికి అదే నంబర్ నుంచి ఫోన్ చేసి బాధపడుతూ తాను భద్రాచలంలో ఉన్నానని తెలిపింది. తాను మధ్యలో వాష్ రూంకు దిగానని, వాటర్ తాగానని, తనకు ఏం తెలియలేదని, కళ్లు తెరిచి చూసే సరికి భద్రాచలంలో ఉన్నానని చెప్పింది. చెవి కమ్మలు, సెల్ ఫోన్ పోయాయంది. ఇక్కడ గుంటూరు వెళ్లే బస్సు ఉందని, విజయవాడ వచ్చేసరికి రాత్రి 2.30 అవుతుందని చెప్పింది. రాత్రి 2.30కు తల్లిదండ్రులు బస్టాండ్‌కు వెళ్లి ఎంత ఎదురుచూసినా రాకపోవడంతో తమ కుమార్తె అదృశ్యమైనట్లు భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.